సాక్షి విశాఖపట్నం

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



అహింసే ఆయుధం

ఐబిఎఫ్ఎల్ జితో ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో నిర్వహించిన 'అహింస రన్' ఉత్సాహంగా సాగింది. 8లో



భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

మట్టల ఆదివారం పురస్కరించుకుని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ర్యాలీ జరిగింది. 8లో



ఇదీ నా దేశమే..

విశాఖలో పర్యటించిన ఫ్రాన్స్ ఫుట్‌బాల్ మాజీ ఆటగాడు వికాష్ తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. 8లో



న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు ధ్వజస్తంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రాలను, చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఏఈవో రమణమూర్తి అందజేశారు.

ఆటిజంపై అవగాహన అవసరం



జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ విశ్వనాథన్

బీచ్‌రోడ్డు: ఆటిజంతో బాధపడుతున్న వారికి కూడా ప్రతిభా పాటవాలు ఉంటాయని, వారికి తగిన సహాయ సహకారాలు అందించాలని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ఆదివారం అవగాహన ర్యాలీ జరిగింది. ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజం లక్షణాలున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారికి సహకరిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. శ్రీనివాసరావు, దిలీప్‌పాత్రో, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఉద్యోగాలకు ద్వారకానగర్‌లోని కంపెనీ కార్యాలయం వద్ద క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. బీఎస్సీ కంప్యూటర్స్, డిప్లమా ఇన్ కంప్యూటర్స్, బీటెక్ కంప్యూటర్స్, ఎంసీఏ (2021, 2022 పాస్‌అవుట్) విద్యార్థులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10000 నుంచి రూ.12000లు జీతం చెల్లిస్తారు. మరిన్ని వివరాలకు 92925 53352 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు జీవీఎంసీ స్పందన

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

నేడు ఇగ్నో వార్షికోత్సవం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం 36వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. జైల్ రోడ్డు దరి విశాఖ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వివిధ డిగ్రీలు పొందిన వారికి ఈ వార్షికోత్సవం సందర్భంగా డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం (విజయనగరం) వీసీ ఆచార్య టీవీ కట్టిమణి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

విజయీభవ

- నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు
- హాజరుకానున్న 29,286 మంది విద్యార్థులు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు



గుర్రంపాలెం పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

కంట్రోల్ రూమ్ నంబర్లు
9440787228
7780453490

విశాఖ విద్య: జిల్లాలో సోమవారం నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయి. ఇందుకోసం జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 27,547 మంది రెగ్యులర్, మరో 1,739 మంది ప్రైవేట్(వన్స్ ఫెయిల్డ్) విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల నిర్వహణకు 136 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు కేటాయించి, అక్కడ వసతి, ఫర్నిచర్ సౌకర్యం కల్పించారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి సౌకర్యంతో పాటు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. డీఈవో ఎల్. చంద్రకళ, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీ మోహన్, స్క్వాడ్ అధికారులు ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

ప్రత్యేక నిఘా

గత అనుభవాల నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక తనిఖీ బృందాలు నియమించారు. జిల్లాలో 136 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ఏ- కేటగిరీ కింద 50, బీ- కేటగిరీ కింద- 77, సీ-కేటగిరీ కింద 9 కేంద్రా లు ఉన్నాయి. సమస్యాత్మంగా కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. 136 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 136 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 14 రూట్ ఆఫీసర్లు, మరో 14 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను నియమించారు. సీ-కేటగిరీ కింద గుర్తించిన కేంద్రాల్లో పరిశీలన కోసమని అదనంగా 5గురు అసిస్టెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులను సిద్ధం చేశారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. పరీక్ష కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలలకు 100 మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని నోటీసులు ఇచ్చారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని ఇప్పటికే విద్యాశాఖాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మాస్టార్లూ జాగ్రత్త

పరీక్ష విధులకు నియమితులైన ఉపాధ్యాయులు కూడా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు కేంద్రంలో రిపోర్ట్ చేయాలి. ఈ సారి ప్రశ్నాపత్రాలపై ప్రత్యేక గుర్తింపు నంబర్‌ను ముద్రించారు. ప్రశ్నాపత్రం బయటకు వస్తే.. అది ఎక్కడ నుంచి వచ్చిందనేది ఈజీగానే గుర్తించే అవకాశం ఉంది. ఇందుకు బాధ్యులైన ఉపాధ్యాయులపై ఈసారి కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖాధికారులు హెచ్చరించారు.

8 కేంద్రాల్లో ఓపెన్ పరీక్షలు

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. 10వ పరీక్షలకు 899 మంది హాజరవుతుండగా, వీరి కోసం నాలుగు కేంద్రాలు, ఇంటర్మీడియట్‌కు 973 మంది హాజరవుతుండగా, వీరి కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఆల్ ద బెస్ట్

10వ తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని విశాఖ, అనకాపల్లి జిల్లాల అబ్జర్వర్, ఆర్జేడీ జ్యోతి కుమారి అన్నారు. జిల్లాలోని ప లు పరీక్ష కేంద్రాలను ఆదివారం పరిశీలించిన ఆమె.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులతో మాట్లాడారు. ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులందరికీ ఆల్ ద బెస్ట్ చెప్పారు.

ఏర్పాట్లు పూర్తి



పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇన్విజిలేషన్ సిబ్బంది అప్రమత్తతో ఉండాలి. స్క్వాడ్ సిబ్బంది తరచూ కేంద్రాలను తనిఖీ చేయాలి. ఎటువంటి అవాంతరాలు ఎదురైనా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి. అంతా సమన్వయంతో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేందుకు కృషి చేయాలి.

-ఎస్.మురళీ మోహన్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్

పరీక్షల వేళ జాగ్రత్త సుమీ!

పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులు సూచిస్తున్నారు. విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9.30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.

- విద్యార్థులు మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాలకు తీసుకెళ్లకూడదు. టాబ్లెట్‌లు, కెమెరాలు, ఇయర్ ఫోన్లు, స్పీకర్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు నిషేధం.
- పరీక్ష సమయంలో దుర్వినియోగానికి పాల్పడిన అభ్యర్థులను తదుపరి పేపర్‌లను రాయడానికి అనుమతించరు.
- 'ఓఎంఆర్ బార్ కోడింగ్' అన్ని పేపర్‌లకు ముద్రించారు. పరీక్ష ప్రారంభానికి ముందు, అభ్యర్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్, రోజూ పరీక్ష వివరాలతో కూడిన ప్రింటెడ్ బార్-కోడెడ్ ఓఎంఆర్ షీటు అందిస్తారు. అభ్యర్థి ఓఎంఆర్ షీటుపై ముద్రించిన వివరాలను అతని/ఆమె పేరు, ఫొటో, రోల్ నంబర్ మొదలైన వాటితో పరిశీలించాలి. ఏదైనా తేడా ఉంటే వెంటనే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లాలి.
- ఎలాంటి ఆహార పదార్థాలను కేంద్రాల్లోకి తీసుకెళ్లకూడదు.
- ప్రశ్నాపత్రాల లీకేజీ లేదా నకిలీ ప్రశ్న పత్రాల అంటూ నిరాధారమైన పుకార్లకు పాల్పడకూడదు. అలాగే చేస్తే కఠిన చర్యలు తప్పవు.

పరీక్షలకు పటిష్ట బందోబస్తు

నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

అల్లిపురం: 10వ తరగతి పరీక్ష కేంద్రాల ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పరీక్ష పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి సర్కిల్‌కు మొబైల్ పెట్రోలింగ్ బృందాలను నియమించామన్నారు. విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే డయల్ 100, డయల్ 112కు గానీ, వాట్సాప్ నంబర్ 94933 36633కు సమాచారం అందించాలని సీపీ శ్రీకాంత్ కోరారు.

నేత్రపర్వం కల్యాణోత్సవం



నృసింహ మండపంలో వేదికపై కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

- అప్పన్న కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తజనం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనులపండువగా జరిగింది. అశేషంగా తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి పరవశించారు. స్వామి నామస్మరణలో మునిగితేలారు. కల్యాణోత్సవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు మధ్యాహ్నం 3 గంటల నుంచి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద పసుపుకొమ్ములను అర్చకులు, ముత్తయిదువులు దంచి కొట్నాల ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. తరువాత ఎదురుసన్నాహోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు రంగు పల్లకీలోను, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలోను వేంజేపచేశారు. మాడవీధిలో జోడు భద్రాల వద్ద స్వామివారు, అమ్మవార్ల వైభవాన్ని, గొప్పతనాన్ని చాటిచెబుతూ ఎదురు సన్నాహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలదండలతో నృత్యాలు చేస్తూ ఎదురు సన్నాహోత్సవం రక్తికట్టించారు. వ్యాఖ్యాతలుగా దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, టీటీడీ వేదపండితుడు కందుకూరి బాలసుబ్రహ్మణ్యశర్మ వ్యవహరించారు.

హోరెత్తిన రథోత్సవం

కల్యాణోత్సవం వేడుకల్లో భాగంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం జాలరి పెద్ద కదిరి లక్ష్మణరావు రథసారథిగా నిలిచి రథ కదలికలను సూచిస్తుండగా,



సింహగిరి మాడవీధిలో స్వామివారి రథోత్సవం



ఎదురు సన్నాహోత్సవంలో పూలదండలతో నృత్యాలు చేస్తున్న అర్చకులు

లక్ష్మీదేవి అమ్మవారి బంధువులుగా నగరం నలుమూలల నుంచి జాలర్లు.. రథం నడిపే బాధ్యతలు చేపట్టారు. అశేష భక్తజనసందోహం స్వామివారి రథాన్ని తాళ్లతో లాగి పరవశించారు. రథంలో ఉన్న స్వామివారిని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, పూసపాటి సుధాగజపతిరాజు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, పంచాడి పద్మ, బయ్యవరపు రాధ తదితరులు దర్శించుకున్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం

నృసింహ మండపంలో రాత్రి 9.30 గంటల నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవం విశేషంగా జరిగింది. రథోత్సవం అనంతరం రథంలో ఉన్న స్వామివారిని, అమ్మవార్లను నృసింహమండపంలో కల్యాణ వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తరువాత భక్తులకు స్వామివారి ముత్యాల తలంబ్రాలను, ప్రసాదాన్ని అందజేశారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేశారు. డీసీపీ ఆనంద్‌రెడ్డి, ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, గోపాలపట్నం సీఐ సతీష్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రథోత్సవంలో ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తాడేపల్లిగూడెంకి చెందిన కొండాలమ్మతల్లి ట్రూప్‌చే జరిగిన కాంతార నృత్య ప్రదర్శన, కేరళకి చెందిన డప్పు వాయిద్యాలు, కాళీమాత నృత్యాలు, విజయనగరానికి చెందిన పులివేషాలు, నగరానికి చెందిన పలు కోలాట బృందాల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

గెస్ట్‌ల పేరిట గోల్‌మాల్

- పోర్టులో అతిథుల పేరుతో రూ.7 కోట్లకు పైగా కొల్లగొట్టిన వైనం
- ఏడాదిన్నర కాలంలో 600 మంది అతిథులొచ్చినట్లు రికార్డులు
- అనధికార ఖర్చులను కార్యక్రమాల బిల్లులంటూ డ్రా చేసిన అధికారి
- పరిపాలన విభాగం ఉన్నతాధికారి తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- పట్టించుకోని విజిలెన్స్ విభాగం.. ఢిల్లీలో ఫిర్యాదు చేసిన ఉద్యోగులు



విశాఖ పోర్టు అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం పోర్టు అథారిటీ అక్రమార్జనకు కామధేనువులా మారిపోయింది. సెంట్రల్ ఆధీనంలో నడిచే పోర్టులో ఏం జరుగుతుందో ఆరా తీసేలోపే.. వ్యవహారాన్ని చక్కబెట్టేస్తున్నారు. అతిథుల పేరుతో రూ.7 కోట్లకు పైగా ఖజానాకు కన్నం పెట్టేశారు. దీని వెనుక కీలక అధికారి ముఖ్య భూమిక వహించగా.. జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉన్న ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పారు. వివరాల్లోకి వెళ్తే.. పోర్టు సందర్శనకు, ఇందులో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వచ్చే అతిథులకు కొంతమేర బిల్లులు కేటాయిస్తారు. సాధారణంగా వచ్చే అతిథికి ఒక వాహనం, భోజన సౌకర్యం, పోర్టు గెస్ట్ హౌస్‌లో ఓ గదిని కేటాయించడమనేది సాధారణ ప్రోటోకాల్‌లో ఓ భాగం. కానీ.. గత ఏడాదిన్నర కాలంగా దీనికి పూర్తి భిన్నంగా వ్యవహరించారు. ఈ సమయంలో సుమారు 600 మంది వరకు గెస్ట్‌లు వచ్చినట్లు పోర్టు రికార్డులు చెబుతున్నాయి. వీరిలో సింహభాగం అతిథులకు పోర్టు గెస్ట్ హౌస్‌లో కాకుండా బీచ్‌రోడ్డులో ఉన్న ప్రముఖ స్టార్ హోటల్‌లో వసతి, ఇతర సౌకర్యాలు కల్పించారు. ఒక్కొక్కరికీ రూ.లక్ష వరకూ బిల్లు అయ్యేది. అయితే.. సదరు గెస్ట్ ఎవరి తరఫున వస్తే.. వారి అకౌంట్ నుంచే బిల్లులు జమ చేస్తారు. కానీ.. ఇలా ఈ ఏడాదిన్నర కాలంలో వచ్చిన గెస్ట్‌లకు ఏ అకౌంట్‌లో బిల్లులు చెల్లించారన్నది మాత్రం ఎక్కడా కనిపించకుండా చేసేశారు. వీటి మొత్తం దాదాపు రూ.5 కోట్ల పైమాటేనని అధికారికంగా లెక్కతేల్చినట్లు తెలుస్తోంది.

బిల్లు ప్రైవేట్.. చెల్లింపు పబ్లిక్..!

వివిధ వర్గాల ప్రతినిధులతో భేటీ అయ్యేందుకు పోర్టు ఉన్నతాధికారులు విజయవాడ వెళ్తుంటారు. అక్కడికి వెళ్తే.. వారి బస, రవాణా, వసతి వరకూ మాత్రమే పోర్టు భరిస్తుంది. కానీ.. సదరు ఉన్నతాధికారులు విజయవాడలో కాక్‌టైల్ డిన్నర్‌పార్టీలు నిర్వహించేవారు. వాటి బిల్లుల్ని విశాఖలో ఉన్న హోటల్ పేరుతో తీసుకునేవారని తెలుస్తోంది. అదేవిధంగా.. పోర్టుకు సంబంధించిన టగ్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా నైట్ పార్టీలు నిర్వహించేవారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక టగ్ నడపాలంటే గంటకు దాదాపు రూ.లక్ష వరకూ ఇంధనం ఖర్చవుతుంది. ఈ పార్టీలు తెల్లవార్ల వరకు జరిగేవనీ.. దీనివల్ల పార్టీ జరిగిన రోజున దాదాపు రూ.5 నుంచి రూ.10 లక్షల వరకూ డీజిల్ ఖర్చయ్యేదనీ.. వీటిని కూడా పోర్టు కార్యకలాపాల్లో భాగంగా టగ్‌లు నడిపినట్లు సాధారణ వ్యవహారాల రికార్డుల్లో తారుమారు చేసేసేవారని పోర్టు వర్గాలు చెబుతున్నాయి. ఇలా గెస్ట్‌ల బిల్లులు, ఈ తరహా అనధికారిక ప్రైవేట్ పార్టీల బిల్లులను అధికారిక కార్యకలాపాల్లో కలిపేసి జమ చేసుకునేవారని సమాచారం.

సెంట్రల్ విజిలెన్స్‌కు ఫిర్యాదు

పోర్టులో జరుగుతున్న అనధికార వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో.. సాధారణ పరిపాలన విభాగంలోని అధికారి తలలు పట్టుకుంటున్నారు. ఈ వ్యవహారాలన్నింటిపై పోర్టులో ఉన్న విజిలెన్స్ విభాగానికి ఒకట్రెండు సార్లు కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. అయినా ఆ ఫిర్యాదులపై కనీస విచారణ చేపట్టకుండా.. ఏం జరుగుతుందన్న విషయాన్ని కూడా పట్టించుకోలేదని తెలుస్తోంది. దీంతో ఇక్కడ పనిచేసే కొందరు ఉద్యోగులు, అధికారులు.. పోర్టులో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలకు సంబంధించి పూర్తి ఆధారాలతో రెండు రోజుల క్రితం ఢిల్లీలో ఉన్న కేంద్ర షిప్పింగ్, పోర్టుల మంత్రిత్వ శాఖ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. స్థానిక హోటల్‌లో పోర్టు తరఫున ఉన్న బిల్లులు, వాటిని క్లెయిమ్ చేసుకునేందుకు అధికారి చేసిన అడ్డగోలు ఫైళ్లను పరిశీలిస్తే.. మొత్తం వ్యవహారం బట్టబయలవుతుందని పోర్టు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

అంతా.. ఆయన కనుసన్నల్లోనే!

పోర్టు ఉన్నతాధికారి చేసిన విచ్చలవిడి దుబారా ఖర్చును సక్రమ బిల్లుల్లోకి సర్దుబాటు చేసే పనిని సాధారణ పరిపాలన విభాగంలోని ముఖ్య అధికారి నిర్వర్తించేవారు. ఏ అడ్డగోలు బిల్లు వచ్చినా దాన్ని తదుపరి పోర్టు అధికారిక కార్యక్రమం వచ్చేంత వరకూ వాటిని గోప్యంగా ఉంచేవారు. ఈలోగా తనకు సంబంధించి కూడా.. కొన్ని బిల్లుల్ని ఉన్నతాధికారి ఖాతాలో కలిపేసేవారు. పోర్టుకు సంబంధించి ఏవైనా కార్యక్రమాలు జరిగినప్పుడు ఈ అనధికార బిల్లులకు రెక్కలొచ్చేవి.

వాటన్నింటినీ అధికారిక ఖాతాలో జమ చేసేసి.. తన జేబుని జీఏడీ అధికారి నింపేసుకునేవారు. ఇలా.. ఈయన కూడా రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకూ అనధికార బిల్లుల్ని కొల్లగొట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



ర్యాలీలో పాల్గొన్న జాన్ వెస్లీ

బీచ్‌రోడ్డు: మట్టల ఆదివారం పురస్కరించుకుని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.కె.బీచ్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు క్రైస్తవ ఆధ్యాత్మిక ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోధులకు రారాజుగా ఏసుక్రీస్తుకు పట్టాభిషేకం చేయడమే మట్టల ఆదివారం ముఖ్య ఉద్దేశమన్నారు.

అందరి పాపాలను ఆయన శిలువ మీద మోసి.. పాప విముక్తి చేయడం కోసం మరణించారని తెలిపారు. జోసెఫ్ ప్రకాష్, ఎం.అనిల్ పాల్, నెల్సన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అహింసే ఆయుధం



అహింస రన్‌కు సిద్ధమవుతున్న నగర ప్రజలు

బీచ్‌రోడ్డు: అహింస అనేది మనిషి ప్రాథమిక సూత్రమని చెబుతూ ఐఐఎఫ్ఎల్ జితో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'అహింస రన్' ఉత్సాహంగా సాగింది. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద 3కే, 5కే, 10కే విభాగాల్లో 'అహింస రన్' ప్రారంభించారు. నగరవాసులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అహింస మార్గాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు దేశంలోని 65 ప్రముఖ నగరాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా 23 దేశాల్లో రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 1.30 లక్షల మంది పాల్గొన్నట్లు తెలిపారు.





10కె విజేతకు అభినందన

పిల్లాడితో ఉత్సాహంగా పరుగు పెడుతున్న తండ్రి

ఇదీ నా దేశమే..

- ఈ నేలపై అడుగుపెట్టగానే ఇదే అనుభూతి కలుగుతుంది
- ఫ్రాన్స్ ఫుట్‌బాల్ ఆటగాడు వికాష్ రావు దొరసూ

విశాఖ స్పోర్ట్స్: ప్రపంచంలో అత్యధిక ఆదరణ ఉన్న క్రీడ ఫుట్‌బాల్. ప్రతి ఫుట్‌బాల్ ఆటగాడు ఫిఫా ప్రపంచ కప్‌లో ఆడేందుకు ఉవ్విళ్లూరుతుంటాడు. కానీ 32 దేశాల జట్లు మాత్రమే అర్హత సాధిస్తాయి. భారత్‌కు అది ఇప్పటికీ ఓ కలే. కానీ భారత సంతతికి చెందిన ఓ ఆటగాడు ఏకంగా ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో ఆడాడు. అతనే వికాష్ రావు దొరసూ. పూర్వీకులు ఇక్కడి వారే అయినా మారిషస్ వెళ్లిపోయి స్థిరపడిపోయారు. వికాష్ ఫ్రాన్స్ దేశంలోని హర్బ్నూర్‌లో జన్మించారు. విశాఖలో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ ఫైనల్ చూసేందుకు వికాష్ వచ్చారు. ఇక్కడ అడుగుపెట్టగానే ఏదో తెలియని అనుభూతి కలుగుతోందని 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకున్నాడు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

కీలకమైన పొజిషన్‌లో..

నేను ఐదు అడుగుల ఆరు అంగుళాలు ఉంటాను. సెంట్రల్ మిడ్‌ఫీల్డర్‌ను. మిడ్‌ఫీల్డర్‌ను కనుక బంతిని అటాకర్స్‌కు అందించడంలోనే నా పాత్ర ఉంటుంది. ఇది ఆటలో కీలకమైన పొజిషన్. చాలా వేగంగా బంతిని డ్రిబిల్ చేస్తూనే ప్రత్యర్థికి అందకుండా జట్టు ఆటగాడికి అందించాలి. కెరీర్‌లో దాదాపు 375 మ్యాచ్‌లు ఆడాను. 16 గోల్స్ చేశాను.

ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్‌గా..

1993 నుంచి 2007 వరకు ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్‌గా ఆటతోనే ఉన్నాను. 50 ఏళ్లు రావడంతో ఇప్పుడు ఆటను ఎంజాయ్ చేస్తున్నా. అంతర్జాతీయ ఆటగాడిగా ఫ్రాన్స్ తరఫున 1999 నుంచి 2006 వరకు ఆడాను. 2006లో ఫ్రాన్స్ జట్టు ఫిఫా ప్రపంచ ఫుట్‌బాల్ కప్ రన్నరప్ సాధించింది. ఆ జట్టులో నేనూ ఓ సభ్యుడిని అయినందుకు గర్వంగా ఉంది.

18 క్యాప్‌లు అందుకున్నా..

అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు ప్రతీ మ్యాచ్‌కు ఓ క్యాప్ ఇస్తారు. క్రీడాకారుడికి అది గౌరవ సూచకం. అలా నేను ఫ్రాన్స్ తరఫున 18 మ్యాచ్‌లాడి 18 క్యాప్‌లను అందుకున్నాను. నేను మిడ్ ఫీల్డర్ అయినా అనూహ్యంగా ప్రపంచకప్‌లో ఓ గోల్ చేశాను.

వేరే దేశ క్లబ్‌కు..

1993లో కెరీర్ ప్రారంభం

1993 ఆగస్టులో సెయింట్ ఎటెన్నీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో లే హవ్రే క్లబ్‌తో నా కెరీర్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలా ఐదేళ్ల పాటు అదే జట్టుతో కొనసాగాను. 1998లో ఒలింపిక్ లియోనైస్‌కు ఆడటం మొదలెట్టాను. లీగ్ రైవల్స్ అయిన గిరోండిన్స్ జట్టుతో 2001, 2002లో తలపడటం, 2003, 2004లో ఫ్రెంచ్ లీగ్ చాంపియన్‌షిప్ సొంతం చేసుకునే స్థాయికి చేరింది.

2004లో ఇటాలియన్ క్లబ్ ఏపీ మిలానోకు రెండేళ్ల కాంట్రాక్ట్‌తో ఆడటం మొదలెట్టాను. ప్రత్యామ్నాయ ఆటగాడిగా కూడా జట్టుకు సేవలందించాను. అదే క్రమంలో యూఈఎఫ్ఏ చాంపియన్స్‌లీగ్ ఫైనల్‌కు చేరుకున్నాం. అయితే టైటిల్ పోరులో లివర్‌పూల్ జట్టు పెనాల్టీలో మాపై ఆధిక్యం సాధించింది. అక్కడే నాకు ఫ్రాన్స్ జట్టు తరఫున ప్రపంచకప్ ఆడే



జట్టుకు అర్హత లభించింది. 2006 ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫై మ్యాచ్‌లో సైప్రస్‌పై మూడు గోల్స్ చేయగా జట్టు 4–0తో గెలిచింది.

ఆ గోల్ మరిచిపోలేనిది

కూపే డి ఫ్రాన్స్ చాంపియన్‌షిప్‌లో 25 యార్డ్‌ల దూరం నుంచే గోల్ చేయడం నా జీవితంలో మరిచిపోలేని సంఘటన. అదీ మనకు దాయాది పాకిస్తాన్‌లా రైవల్రీ జట్టు మారెసెల్లీపైనే జరిగింది. 2006లో జట్టు మేనేజర్ లకొంబేపై వ్యాఖ్యతో పీఎస్‌జీ కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. ఓ ఫ్రెంచి ప్రొఫెషనల్ ఆటగాడిని ఈ విధంగా తొలగించడం అదే తొలిసారి. 2007లో లివార్నొకు కాంట్రాక్ట్ కుదిరినా ఆడకుండానే వైదొలిగాను.

ఫిట్‌నెస్ కాపాడుకోవాలి

గతంలోనూ ఇక్కడకు వచ్చాను. ఈ నేల తాకగానే ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. పేదరిక నిర్మూలన లాంటి కార్యక్రమాల్లో పాల్గొంటాను. ఫుట్‌బాల్ అనేది చాలా స్టామినా, పవర్, స్ట్రెంగ్త్‌తో కూడుకున్న ఆట. ఆటగాళ్లు ఎప్పుడూ ఫిట్‌నెస్‌గా ఉండాలి. పుట్టింది ఇక్కడ కాకపోయినా.. ఇక్కడ అడుగుపెట్టగానే ఇదీ నా దేశమే అనే ఫీలింగ్ కలుగుతుంది. ఇక్కడకు రాగానే ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. అని వికాష్ ముగించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,000
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,000
వెండి(కిలో):	రూ.77,700

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.100
స్కిన్	: రూ.170
స్కిన్‌లెస్	: రూ.180

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	430.00
విజయనగరం	434.00
శ్రీకాకుళం	434.00

పెయింటర్‌కు గుచ్చుకున్న ఇనుప రాడ్

తొలగించిన కేజీహెచ్ వైద్యులు

మహారాణిపేట/మర్రిపాలెం: భవనంపై నుంచి కింద పడిన పెయింటర్ అప్పలరాజు తొడ వెనుక భాగం(ఎడమ పిరుదు)లో గుచ్చుకున్న ఇనుప రాడ్డును కేజీహెచ్ వైద్యులు తొలగించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. బిర్లా జంక్షన్‌కు చెందిన గుడి అప్పలరాజు పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పూటుగా మద్యం సేవించి.. మురళీనగర్ ప్రాంతంలోని సాయినగర్‌లోని ఓ భవనంలో పనికి వెళ్లాడు. ఈ క్రమంలో భవనం కింద ఉన్న పిల్లర్‌పై పడిపోవడంతో.. పిల్లర్ రాడ్డు అతడి ఎడమ పిరుదు భాగంలోకి వెళ్లిపోయింది. ఇది గమనించిన స్థానికులు కట్టర్ సాయంతో రాడ్డును కట్ చేశారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. క్యాజువాలిటీకి దగ్గరగా ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో రెండో యూనిట్ చీఫ్ డాక్టర్ జె.కిశోర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ధర్మకిశోర్, వైద్యుడు నవీద్ ఖాన్ తదితరులు అప్పలరాజుకు శస్త్ర చికిత్స చేసి రాడ్‌ను తొలగించారు. ప్రస్తుతం అప్పలరాజు ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలిపారు. అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదో పట్టణ సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ ఎస్.సుజేశ్వరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అప్పలరాజుకు గుచ్చుకున్న రాడ్

గంజాయితో ముగ్గురి అరెస్టు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని పార్సిల్ సర్వీస్ ద్వారా గంజాయి రవాణా చేయడానికి ప్రయత్నించిన ముగ్గుర్ని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 140 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. శనివారం ఆటోనగర్ డి– బ్లాక్‌లోని సేఫ్ ఎక్స్‌ప్రెస్ పార్సిల్ కార్యాలయానికి గంజాయి ప్యాకెట్లు తీసుకువచ్చారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసి అరుణ్ కుమార్, గోపాల్, బిచ్చూరాయ్‌లను అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు బిహార్‌కు చెందిన వారు కాగా, ఒకరు అల్లూరి జిల్లా అనంతగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తి. అనంతగిరి తదితర ప్రాంతాల నుంచి గంజాయి సేకరించి కొరియర్ సర్వీసు ద్వారా ఢిల్లీకి పార్సిల్ చేసేందుకు ఆటోనగర్‌కు తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు.

గోల్ఫ్ ఓవరాల్ చాంప్ చంచల్‌గుప్త

విశాఖ స్పోర్ట్స్: గోల్ఫ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను చంచల్ గుప్తా సాధించాడు. గోల్డ్ డివిజన్ విజేతగా బ్రిగేడర్ పఠానియా, రన్నరప్‌గా కెప్టెన్ నగేష్‌జైన్ నిలిచారు. సిల్వర్ డివిజన్ విజేతగా వినయ్‌సెహ్గల్, రన్నరప్‌గా డి.సురేష్‌కుమార్ నిలిచారు. బ్రాంజ్ డివిజన్‌లో రాజశేఖర్ విజేతగా, సతీష్‌కుమార్ రన్నరప్‌గా.. సీనియర్ డివిజన్ విజేతగా జి.ఆర్.జి.రెడ్డి, రన్నరప్‌గా హబీబ్ నిలిచారు. 295 యార్డ్స్ హిట్‌తో స్నహిల్ సూద్ లాంగెస్ట్ డ్రైవ్ చేయగా... క్లోజెస్ట్ పిన్‌గా యువరాజ్ భరాథియా నిలిచారు. ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్, రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో ఈకోరైల్వే, డైకిన్ సంయుక్త సహకారంతో ఈ టోర్నీ ఈపీజీసీలో ఆదివారం జరిగింది. విజేతలకు డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి జ్ఞాపికలందించారు. కార్యక్రమంలో కిశోర్‌కుమార్, డైకిన్ ప్రతినిధి అంకూర్‌కుమార్, ఈపీజీసీ కార్యదర్శి సాహి, ఈపీజీసీ గోల్ఫర్స్ పాల్గొన్నారు.



చాంప్ చంచల్‌ను అభినందిస్తున్న ఈపీజీసీ కార్యదర్శి సాహి

ఏపీఎల్ కౌన్సిల్ ఏర్పాటు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియల్ లీగ్(ఏపీఎల్) ప్రస్తుత సీజన్ 2023కు గాను గవర్నింగ్ కౌన్సిల్‌కు ఇద్దరు ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఆదివారం ప్రత్యేక సాధారణ సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.ఎ.వి.ఎస్.మల్లేశ్వరరావు వ్యవహరించారు. గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా మోంచో ఫెర్రర్, కార్యదర్శిగా ఎస్.ఆర్.గోపినాథ్, కోశాధికారిగా ఎ.వి.చలం, సీఏజీ సభ్యునిగా జితేంద్రనాథ్ శర్మ, సీఈఓగా ఎం.వి.శివారెడ్డి, సభ్యునిగా మోనిష్ సెహగల్, ప్లేయర్స్ ప్రతినిధిగా జి.వి.వి.గోపాలరాజు నియమితులయ్యారు. అలాగే ఈ సమావేశంలో ఏపీఎల్ 2వ సీజన్‌కు సలహా కమిటీ సభ్యులను నియమించింది. సత్యప్రసాద్ యాచేంద్ర చైర్మన్‌గా, అష్ఫాక్ రహీమ్‌ఖాన్, అర్జున్‌కుమార్ సోమంచి, జి.వి.ఎస్.ప్రసాద్, జి.ఎస్.మల్లికార్జున సభ్యులుగా వ్యవహరించనున్నారు. సమావేశంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎ.రాకేష్, కోశాధికారి ఏవిచలం, కౌన్సిలర్ కేవి పురుషోత్తంరావు, మహిళా క్రీడాకారిణుల ప్రతినిధి ఎన్.గీత, సీఏజీ సభ్యుడు జితేంద్రనాథ్‌శర్మ, సీఈఓ శివారెడ్డి, చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ వైవిఎస్ జగన్నాథరావు, లీగల్ మేనేజర్ డి.నాగేశ్వరరాజు, అనుబంధజిల్లాల, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఉత్సాహంగా బాడీలిఫ్టింగ్ పోటీలు



పతకాలతో విజేతలు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపంలో జరిగాయి. సీనియర్స్‌కు ఏడు గ్రూపుల్లో, మాస్టర్స్‌కు మూడు గ్రూపుల్లో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు జ్ఞాపికలందించారు. 55 కేజీల వెయిట్ కేటగిరిలో సూర్యనారాయణ, హరికుమార్, యుగంధర్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 60 కేజీల వెయిట్ కేటగిరిలో విష్ణువర్ధన్, ప్రసాద్‌రెడ్డి, హరిప్రసాద్, 65కేజీల వెయిట్ కేటగిరిలో గణేష్, సల్మాన్, నాగేంద్ర, 70 కేజీల వెయిట్ కేటగిరిలో దిలీప్, ఆకాష్, అనిల్‌కుమార్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 75 కేజీల వెయిట్ కేటగిరిలో మణికంఠ, కుమార్‌రెడ్డి, అనుదీప్, 80కేజీల వెయిట్ కేటగిరిలో ఆనందరావు, వంశీ, భాస్కర్, 80+కేజీల వెయిట్ కేటగిరిలో చందు, ప్రణయ్, విద్యాసాగర్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. మాస్టర్స్ 40–45 ఏళ్ల వారిలో సీతారామ్, శ్రీనివాసరావు, వేంకటేశ్వరరెడ్డి, 45–50లో శ్రీరామచంద్రన్, గోవిందరావు, వెంకటరావు, 50+లో ఆనందరావు, సింహాచలం, మహేశ్వరరావు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, 14వ వార్డు కార్పొరేటర్, పద్మారెడ్డి, బాడీలిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు శివశంకర్ పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికలందిస్తున్న కేకే రాజు

అప్పన్నకు అమరావతి రైతుల పూజలు

సింహాచలం: అమరావతి నుంచి సింహాచలం వచ్చిన పలువురు రైతులు శనివారం సాయంత్రం కొండదిగువ తొలిపావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అమరావతి రాజధానిగా అప్పుడు ప్రతిపక్షనేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా మద్దతు పలికారన్నారు. ముఖ్యమంత్రి కాగానే మాటమార్చారన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎలా పరిపాలించారో... జగన్‌మోహన్‌రెడ్డి కూడా అలాగే పాలిస్తారని నమ్మి ఓట్లు వేసి గెలిపించామన్నారు. అమరావతి రాజధానిగా ఉంటే భవిష్యత్‌లో అందరికీ ఏవిధంగా ఉపయోగకరంగా ఉంటుందో రాష్ట్రమంతా తిరిగి అన్ని ప్రాంతాల వారికీ చెబుతున్నామన్నారు.



తొలిపావంచా పూజలు నిర్వహిస్తున్న రైతులు

నగరంలో నేడు

- ఉదయం 10.30 గంటలకు జగదాంబ జంక్షన్‌లో సీపీఎం జగదాంబ కమిటీ ఆధ్వర్యంలో పన్ను, టోల్ చార్జీల పెంపునకు నిరసన
- ఉదయం 11.00 గంటలకు పాత జైలు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ మహిళా కాలేజీలో ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం 36వ స్నాతకోత్సవం
- ఉదయం 11.00 గంటలకు డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

నేత్రపర్వం.. కల్యాణోత్సవం

కల్యాణోత్సవానికి తరలివచ్చిన అశేష జనం



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. అశేషంగా తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి పరవశించారు. - సింహాచలం











అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు